తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
5 అక్టోబర్ 2026
పేజీలు : 08
Follow :




“ ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల కోసం సీనియర్ సిటిజన్ యాక్ట్ వంటి చట్టాలను తీసుకొచ్చింది. వృద్ధులు, తల్లిదండ్రులను వారి కుమారులు పట్టించుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారి ఆస్తులను తిరిగి వారి పేర్లపైకి బదలాయించేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. కలెక్టర్, ఆర్డీవో స్థాయిలో ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ లక్ష్యం నీరుగారి పోతోందన్న విమర్శలు ఉన్నాయి.

### తహసీల్దార్ కార్యాలయంలోనే రైతు..

మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం పారుపల్లి గ్రామానికి చెందిన రైతు లావప్ప తన భూ సమస్యపై ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగాడు. సమస్య పరిష్కారం కాక విసిగిపోయిన లావప్ప ఏకంగా తహసీల్దార్ కార్యాలయంలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# వినతులు వింటారు... పరిష్కరించరు

## అధికారుల చుట్టూ తిరిగి.. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వృద్ధులు

- ఫిర్యాదులు చేసినా పరిష్కారం లేక.. చివరకు బలవన్మరణాలు
- ఆస్తులు పంచినా ఎటువైపు నుంచీ అండకు నోచుకోని పండుటాకులు

## ప్రజావాణి గోడు.. అధికారుల చెవికి వినిపించదా?

రంగారెడ్డి/హైదరాబాద్ (జనంసాక్షి) :

*ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి.. కొందరు వృద్ధులు, రైతులకు మాత్రం పరిష్కారం చూపలేకపోతోంది. న్యాయం కోసం కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో బాధితులు తీవ్రంగా విసిగిపోతున్నారు. ముఖ్యంగా వయసు పైబడిన వృద్ధులు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగలేక నానా అవస్థలు పడుతున్నారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో కొందరు వృద్ధులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వ చట్టాలు, ప్రజావాణి కార్యక్రమాలు ఉన్నా.. క్షేత్రస్థాయిలో బాధితులకు న్యాయం అందుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.*

ధరణిలో జరిగిన పొరపాట్లను సరిచేసి తెలంగాణ రైతులు, వృద్ధులకు న్యాయం చేసేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని ప్రభుత్వం సభలు, సమావేశాల్లో చెబుతోంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోల నిర్లక్ష్యంతో వృద్ధులు, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్లు, ఆర్డీవోలకు బాధితులు తమ సమస్యలను విన్నవిస్తున్నా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొందరు వృద్ధులు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడగా.. మరో రైతు ఏకంగా తహసీల్దార్ కార్యాలయంలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వయసు పైబడిన వృద్ధులు, రైతులు నెలల తరబడి కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం అందకపోవడంతో తీవ్రంగా విసిగిపోతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేక కొందరు చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

### బుక్కెడు బువ్వ కోసం.. బావిలో దూకి..

గత నెల సెప్టెంబర్ 30న సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చెప్టాలో ముగ్గురు కుమారులు ఉన్న వృద్ధ దంపతులు ముంగే నర్సారెడ్డి (88), అంజమ్మ (85) ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారులకు 25 ఎకరాల భూమితో పాటు ఇంటిని పంచి ఇచ్చిన ఈ దంపతుల పోషణ బాధ్యతలను కొన్నేళ్లుగా కుమారులు పట్టించుకోలేదని సమాచారం. ఆకలిని తట్టుకోలేక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తూ కాలం వెళ్లదీసిన వారు.. బతుకుతెరువు కోసం కనీసం రెండు ఎకరాల భూమినైనా తమ కుమారుల నుంచి ఇప్పించాలని అధికారులను వేడుకున్నారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెవెన్యూ, పోలీసు అధికారుల చుట్టూ తిరిగినా తమ గోడును ఎవరూ పట్టించుకోలేదని, చివరకు బుక్కెడు బువ్వ కూడా కరువై వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొంటున్నారు.



### 80 ఏళ్ల వృద్ధురాలి నిరీక్షణ

రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పి. అనసూయమ్మ (80) తన కుమారులు తనకు తెలియకుండా ఫేక్ ప్రొసీడింగ్, ఫేక్ అఫిడవిట్‌తో తన భర్త భూమిని అక్రమంగా విరాసత్ చేసుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మోసం, చీటింగ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో తప్పుడు విరాసత్‌ను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని అనసూయమ్మ గత మూడు నెలలుగా తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు తప్పుడు విరాసత్‌ను అధికారులు రద్దు చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తప్పుడు విరాసత్‌ను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని అనసూయమ్మ కోరుతున్నారు.

## కిష్కింధకాండను తలపిస్తున్న యాలాల రాజకీయాలు!



- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి కౌంటర్
- నిజాయితీగా బ్రతకడం మా స్థాయి..దొంగ లెక్కలు చేయడం మీ స్థాయి

## కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కడగండ్లు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి
- ఎమ్మెల్యే అరాచకాలపై తిరగబడతం



# కిష్కింధకాండను తలపిస్తున్న యాలాల రాజకీయాలు!

**యాలాల అక్టోబర్ 4 (జనం సాక్షి) :** యాలాల మండలంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య కొనసాగుతున్న రాజకీయ విమర్శలు–ప్రతివిమర్శలు రామాయణంలో "కిష్కింధకాండను" తలపిస్తున్నాయి అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు తనపై చేసిన ప్రత్యేక ఆరోపణలను ప్రస్తావిస్తూ, వాటిపై రవీందర్‌రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్ నాయకులు తనపై చేసిన ఆరోపణలను ఆయన ప్రస్తావిస్తూ.. తన రాజకీయ, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఆరోపణలు చేసే వారు వాటికి ఆధారాలు చూపాలని, వాస్తవాలు లేకుండా రాజకీయ విమర్శలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని పేర్కొన్నారు.

"నిజాయితీగా బ్రతకడం మా స్థాయి.. దొంగ లెక్కలు చేయడం మీ స్థాయి" అంటూ రవీందర్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తనపై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు వాటిని నిరూపించేందుకు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ చేశారు. రాజకీయంగా విమర్శించడాన్ని తాము తప్పుపట్టడం లేదని, అయితే వ్యక్తిగత ఆరోపణలు చేస్తే వాటికి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. అధికార, ఆధిపత్య పోరాటాల కంటే ప్రజా సమస్యల పరిష్కారమే రాజకీయ నాయకుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తమ బాధ్యత అని, అదే సమయంలో అధికార పక్షం ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని రవీందర్‌రెడ్డి అన్నారు. అయితే విమర్శలు వ్యక్తిగత ఆరోపణలుగా మారకుండా ఆధారాలతో మాట్లాడాలని సూచించారు.

యాలాల మండల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్లు, సాగునీరు, రైతులు, విద్య, వైద్యం వంటి సమస్యలపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి పరస్పర ఆరోపణలకే రాజకీయాలను పరిమితం చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదన్నారు. తనపై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలకు అవసరమైన సందర్భంలో వాస్తవాలతో సమాధానం ఇస్తామని, తప్పుడు ఆరోపణలకు భయపడేది లేదని రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాల్లో నిజాయితీ మాటల్లో కాకుండా ప్రజల ముందు నిలబెట్టే వాస్తవాలు, పనితీరు, జవాబుదారీతనం ద్వారా నిరూపించుకోవాలని అన్నారు.

"ఎవరు ఏమి మాట్లాడారన్నది కాదు.. ఎవరు ఏం చేశారన్నదే ప్రజలు గమనిస్తారు. ఆరోపణలు కాదు.. ఆధారాలు మాట్లాడాలి" అని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కడగండ్లు

**రంగారెడ్డి, అక్టోబర్ 4 (జనంసాక్షి) :**
కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కడగండ్లు మాత్రమే మిగిలాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపిపి కృపేష్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల బీఆర్ఎస్ అధ్యక్షులు చిలుకల బుగ్గరాములు అధ్యక్షతన ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన మండల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం కేసీఆర్ ను కేటీఆర్ ను తిడుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. రైతులను, మహిళలను, ఉద్యోగులను, నిరుద్యోగులను, యువతను, విద్యార్థులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ఏకమవుతున్నారని చెప్పారు. అనుకోకుండా దక్కిన అధికారాన్ని కేవలం సంపాదన కోసమే కాంగ్రెస్ పాలకులు వినియోగిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కేవలం ఆడంబరాలకు, వసూళ్లకు, సంపాదనకు, బెదిరింపులకు, శిలాఫలకాలకు మాత్రమే పరిమితమయ్యాడని మండిపడ్డారు. మండల సమావేశాల్లో సర్పంచులను ప్రజా సమస్యల గురించి మాట్లాడకుండా ఎమ్మెల్యే చిల్లరగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే తన పిచ్చి చేష్టలు మానకపోతే మంచాల మండల సమావేశంలో తిరగబడ్డట్టుగా తగు గుణపాఠం చెబుతారన్నారు. ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల గ్రామీణ మండలాలకు కనీసం ఒక్క హ్యామ్ రోడ్డును కూడా ఎమ్మెల్యే మంజూరు చేయించలేకపోయారని వారు మండిపడ్డారు. ఎమ్మెల్యే మల్ రెడ్డికి అక్రమ సంపాదన మీద ఉన్న ఆసక్తి అభివృద్ధి మీద లేదని వారు దుయ్యబట్టారు. ఎమ్మెల్యే బెదిరింపులతో నియోజకవర్గంలో అభివృద్ధి అడుగంటిందని, రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని విమర్శించారు. ప్రభుత్వ అధికారులను బెదిరించి తప్పుడు పనులు చేయిస్తున్నారని, చివరకు పోలీసులను కూడా పని చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దళితుల భూముల్లో ఎమ్మెల్యే మనుషులు అక్రమ మట్టి దందాలు చేస్తూ రైతులను దోచుకుంటు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అరాచకాలపై ప్రజల తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ రెండు స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని వారు ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏనుగు నరేందర్ రెడ్డి, మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, మంద సురేష్, సర్పంచులు కాలె గణేష్, బింగి గీత, బోసుపల్లి శ్రీవేణి, సామ అశ్విని, మంద యాదమ్మ, సొసైటీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు జగదీష్, మాజీ సర్పంచులు యాదగిరి, బల్వంత్ రెడ్డి, జెట్టి కృష్ణ, నాయకులు పొన్నాల జగదీష్, జలంధర్ గౌడ్, నర్సింహ్మ, రవీందర్, అంజయ్య, అయిలయ్య, వీరయ్య, బాష, శ్రీకాంత్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతి కుమార్ ఔదార్యం

**పార్టీ కార్యకర్తలకు ఆర్థిక సహాయం అందజేత**



**బొంరాస్ పేట, అక్టోబర్ 4 (జనం సాక్షి):** మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త కావలి శంకర్ విద్యుత్ పనులు చేస్తుండగా 33 కెవి విద్యుత్ లైన్‌పై నుండి క్రింద పడి ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇటీవల అటవీశాఖ అధికారులు ఊరేనికితండా కు చెందిన రవినాయక్ నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చివేయడంతో నష్టపోయిన ఇద్దరూ కార్యకర్తలకు చెరో రూ.50,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతి కుమార్ ఔదార్యంతో నగదును అందజేయడం జరిగిందని మండల అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మదన్, నాగురావు, బాబయ్య నాయుడు, జనార్ధన్, సతీష్, మహేష్, వెంకటయ్య, రవి, హనుమంతు, రమేష్ పాల్గొన్నారు.

## పెద్దేముల్ ఎఫ్ఎస్సీఎస్‌కు కొత్త పాలకవర్గం

**చైర్మన్‌గా ఎల్లారెడ్డి.. వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్**

**పెద్దేముల్, అక్టోబర్ 4 (జనంసాక్షి):** రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్సీఎస్)ను మరింత అభివృద్ధి చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్‌గా ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్ నియమితులయ్యారు. నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. రైతులకు అవసరమైన రుణాలు, వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని సూచించారు. సంఘం సేవలు అర్హులైన రైతులకు పారదర్శకంగా చేరేలా పనిచేసి, పెద్దేముల్ ఎఫ్ఎస్సీఎస్‌ను ఆదర్శ సహకార సంఘంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. నూతన చైర్మన్ ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. డైరెక్టర్లుగా బుద్ధారం నాగేష్, సయ్యద్ అన్వర్, సందుల రాజు, కాస అమృతమ్మ, జీ. రామకృష్ణారెడ్డి, భీమయ్య, షబ్బీర్, రాములమ్మ, చందర్, వెంకటయ్య, అంజలి అప్ప తదితరులు నియమితులయ్యారు. కార్యక్రమంలో పెద్దేముల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. మహిపాల్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాయిలు, నాయకులు ప్రవీణ్‌కుమార్, విద్యాసాగర్, నరేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఆపద్బాంధవుడు డాక్టర్ సంపత్‌కుమార్

**సేవా కార్యక్రమాలతో తాండూరులో ప్రత్యేక గుర్తింపు**

**తాండూరు, (జనంసాక్షి):** పేదలకు అండగా, ఆపదలో ఉన్నవారికి చేయూతగా బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సంపత్‌కుమార్ సేవలందిస్తున్నారు. రక్తం అవసరమని సమాచారం అందిన వెంటనే స్పందిస్తూ అత్యవసర సమయాల్లో రక్తదానం చేయిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు రోగులకు ఫౌండేషన్ ద్వారా రక్తం సమకూర్చారు. నిరుపేద విద్యార్థుల ఫీజులు, పేద రోగులకు మందులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధితులకు ఆర్థిక సాయం చేస్తూ వారి పిల్లల చదువులకు అండగా నిలుస్తున్నారు. వైద్యుడిగా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ సేవాభావాన్ని చాటుకుంటున్నారు.

# ప్రజల హృదయాల్లో ఇంద్రారెడ్డి చిరస్మరణీయం

**ఉమ్మడి జిల్లాలో ఘనంగా జయంతి వేడుకలు.. పలువురి నివాళులు**

**చేవెళ్ల, అక్టోబర్ 4 (జనంసాక్షి):** దివంగత మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను ఆదివారం చేవెళ్ల, మొయినాబాద్, తాండూరు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి రాజకీయ, సామాజిక సేవలను పలువురు నాయకులు స్మరించుకున్నారు.

**కౌకుంట్లలో సబితా ఇంద్రారెడ్డి నివాళులు**

చేవెళ్ల మండలం కౌకుంట్లలోని ఇంద్రారెడ్డి సమాధి వద్ద, చిట్టంపల్లి గేట్ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి కూడా సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం ఇంద్రారెడ్డి చేసిన కృషి ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. ప్రజా సమస్యలపై ఆయన స్పందించిన తీరు, అభివృద్ధి కోసం చేసిన ప్రయత్నాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటమే తమ లక్ష్యమన్నారు.

కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పట్లోళ్ల కృష్ణారెడ్డి, కౌశిక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మొయినాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుల నివాళులు**

మొయినాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా జీవితంలో



ఇంద్రారెడ్డి చూపిన నిబద్ధత, ధైర్యం ఆదర్శనీయమన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఆయన విధానాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఇంద్రారెడ్డి జీవితం, ప్రజా సేవను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నరసింహారెడ్డి, కోట్ల నరోత్తంరెడ్డి, ముదిగొండ శ్రీహరి యాదవ్, సుధాకర్ యాదవ్, మాణిక్‌రెడ్డి, రాఘవరెడ్డి, తిరుపతిరెడ్డితో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కోటబాస్పల్లిలో చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో**

తాండూరు మండలం కోటబాస్పల్లి గ్రామంలో ఇంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన 72వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, సిటీ కేబుల్ ఎండీ గొట్టిగ నరసింహారెడ్డి బాబన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఇంద్రారెడ్డి ఈ ప్రాంతంలోని గని కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి వారి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. ఆ



సేవల కారణంగానే కార్మిక వర్గాల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఏర్పడిందన్నారు. ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగించేందుకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని నరసింహారెడ్డి తెలిపారు. ఆయన సేవలను నేటి తరానికి పరిచయం చేయడంతో పాటు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని కోరారు. ఇంద్రారెడ్డి తమ గ్రామానికి అల్లుడు కావడం గర్వకారణమని కోటబాస్పల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గొట్టిగ రాజశేఖర్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు నాగప్ప, పీఏసీఎస్ డైరెక్టర్ చాకలి నరసింహులు, చాకలి వెంకట్, వీవీ రెడ్డి, బోయిని జగదీష్, గుర్రంపల్లి మధు, కిష్టప్ప, బురానుద్దీన్, ఎండీగౌస్, నవీన్ పాల్గొన్నారు.





# బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామసభల ప్రతిజ్ఞ

**కేంద్ర ప్రభుత్వ చొరవను స్వాగతించిన స్కోప్**



**హయత్ నగర్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** జనగామ, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో క్షేత్ర స్థాయిలో బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్న స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), దేశవ్యాప్తంగా బాల్యవివాహాల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని స్వాగతించింది.

గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా గ్రామసభలు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, తమ గ్రామాలను బాల్యవివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తీర్మానాలు చేయడం అభినందనీయమని స్కోప్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి, బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టిగా ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు కలిసి బాల్యవివాహాల నిర్మూలనకు కట్టుబాటు ప్రకటించారు. స్కోప్ అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ, బాల్యవివాహాల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రయత్నాలకు మరింత ఊతమిస్తుందని అన్నారు. లక్ష్య సాధన కోసం ప్రభుత్వంతో, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ స్కోప్ తన క్షేత్రస్థాయి కృషిని కొనసాగిస్తుందని తెలిపారు. "దేశంలోని ప్రతి గ్రామం నుంచి బాల్యవివాహాలను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక గ్రామసభల ద్వారా చేపట్టిన ఈ ప్రచారాన్ని స్కోప్ సంస్థ హృదయపూర్వకంగా స్వాగతిస్తోంది. ఈ దిశగా జిల్లా కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు కూడా అభినందనీయం" అని డాక్టర్ బండి సాయన్న అన్నారు. దేశవ్యాప్తంగా 2.42 లక్షలకు పైగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహించబడి, గ్రామాలను బాల్యవివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తీర్మానాలు ఆమోదించినట్లు స్కోప్ తెలిపింది. స్కోప్ సంస్థ దేశంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్ సి) నెట్‌వర్క్‌లో భాగస్వామ్య సంస్థగా పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 300కు పైగా భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థలతో కలిసి జేఆర్ సి, ప్రభుత్వాలు మరియు అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తోంది. జేఆర్ సి తన భాగస్వామ్య సంస్థలతో కలిసి ఒక తరం కాలంలోనే బాల్యవివాహాల ఆచారాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి ఉద్యమాన్ని కొనసాగిస్తోంది. 2024లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ""బాల్యవివాహ రహిత భారత్" ప్రచారంతో ఈ ఉద్యమానికి మరింత వేగం లభించిందని స్కోప్ పేర్కొంది.



# మహిళలకు మిస్ అండ్ మిస్సెస్ బెల్లెజా అందాల పోటీలో పాల్గొనే అవకాశం

**హైదరాబాద్, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** ఫ్యాషన్ రంగంపై ఆసక్తి కలిగి, తమ ప్రతిభను చాటుకునేందుకు సరైన వేదిక కోసం ఎదురుచూస్తున్న మహిళలకు మిస్ అండ్ మిస్సెస్ బెల్లెజా – సీజన్ 3 అందాల పోటీలు అవకాశం కల్పించనున్నాయి. ఈ పోటీలను వి2వి ఈవెంట్స్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'బ్యూటీ విత్ పర్పస్' అనే థీమ్‌తో అక్టోబర్ 31న హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వి2వి ఈవెంట్స్ నిర్వాహకురాలు వందన దాసరి వెల్లడించారు. పోటీలో పాల్గొనేందుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు హైదరాబాద్ ఆడిషన్‌లో ఎంపిక రౌండ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫ్యాషన్ రంగంలోకి ప్రవేశించాలనే ఆసక్తి ఉన్న సాధారణ మహిళలను కూడా ప్రోత్సహించడం, వారికి తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వందన దాసరి పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పోటీలో పాల్గొనాలనుకునే ఆసక్తిగల మహిళలు, రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర వివరాల కోసం 8977923028 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**బంట్వారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బక్క పురుషోత్తం రెడ్డి**



**బంట్వారం అక్టోబర్ 04 (జనంసాక్షి) :** హైదరాబాద్ మహబూబ్ నగర్ -రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృశ్య వికారాబాద్ నియోజక వర్గంలోని బంట్వారం మండలంలో ఉన్న అర్హులైన పట్టబద్రులు ప్రతి ఒక్కరూ విధిగా ఓటు నమోదు చేసుకోవాలని బంట్వారం మండలం కాంగ్రెస్ అధ్యక్షులు బక్క పురుషోత్తం రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి మూడేండ్లు పూర్తయిన అర్హత కలిగిన ప్రతి పట్టాభద్రుడు ఫాం నెంబర్ 18 లో ద్వారా ఆన్ లైన్లో లేదా సంబంధిం చిన తహసీల్దార్ కార్యాలయంలో ఓటు నమోదు చేసు కోవాలని, ఓటు నమోదుకు డిగ్రీ సర్టిఫికెట్ సమానమైన విద్యర్హత గల సర్టిఫికెట్, ఆధార్, ఓటర్ ఐడి, ఫోటో, గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరణ పత్రం విధిగా జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో సమ ర్పిం చాలని తెలిపారు. గతంలో పట్టభద్రు లు ఓటరుగా నమోదై ఉన్నవారు కూడా ఈసారి తప్పనిసరిగా మళ్లీ దరఖాస్తు చేసు కోవాలని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు నవంబర్ 6, 2026 లోపు ఫారం 18 ను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచిం చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు 60 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టారని పేర్కొన్నారు. మరో లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ ప్రక్రియను ప్రారంభించనున్నదని, ఉద్యోగులు పెన్షనర్లకు2 డీఏలు మంజూరు చేసేందుకు క్యాబినెట్ రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు పట్టభద్రులు, ఉద్యో ఆమోదం తెలపడం సంతోషకరమైన విషయమని తెలిపా గులు, నిరుద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుం దని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రులు ఓటు నమోదు. చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

# మిస్సింగ్ వ్యక్తి కోసం గాలింపు

**హయత్‌నగర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగనాయకులగుట్టకు చెందిన షేక్ బాషా (38), మెకానిక్‌గా పనిచేస్తున్న వ్యక్తి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్టోబర్ 3న రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన బాషా, రాత్రి సుమారు 9.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు ఆయన బైక్ తాళాలు, సెల్‌ఫోన్ తీసుకున్నారు. మరుసటి రోజు అక్టోబర్ 4న ఉదయం 7 గంటలకు కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా బాషా ఇంట్లో కనిపించలేదు. అయితే ఆయన సెల్‌ఫోన్, బైక్ తాళాలు మాత్రం ఇంట్లోనే ఉన్నాయి. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలతో పాటు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కోసం గాలింపు కొనసాగుతోంది.

షేక్ బాషా ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా కనిపిస్తే వెంటనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు హయత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య మాట్లాడుతూ, 8712662640 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

# జర్నలిస్టులు - పోలీసులు, అడ్వకేట్లకు క్రీడా పోటీలు

**గంజాయి నిర్మూలనే మా ధ్యేయం : జర్నలిస్టులు**

**తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు రావాలి : అడ్వకేట్లు**



**హుజూర్ నగర్ అక్టోబర్ 4 (జనంసాక్షి) :** జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గంజాయి నిర్మూలనలో భాగంగా జర్నలిస్టులు, పోలీసులు,లాయర్లకు క్రీడా పోటీలను ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ చరమంద రాజు మాట్లాడుతూ.. జర్నలిస్టులు, పోలీసులు, లాయర్లు సమాజానికి మూడు ముఖ్యమైన స్తంభాలుగా నిలుస్తాయన్నారు. జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జాతీయ కబడ్డీ క్రీడాకారుడు మోర్తాల నాగిరెడ్డి నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతిని జర్నలిస్టుల జట్టు గెలుచుకుంది. రెండో బహుమతిని పోలీసు జట్టు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మోర్తాల నాగిరెడ్డి మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, క్రీడల వైపు దృష్టి మళ్లించాలనే ఉద్దేశ్యం ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, పోలీసు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు. గంజాయి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జర్నలిస్టులు, పోలీసులు, న్యాయవాదుల స్నేహపూర్వక క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు.

# హయత్‌నగర్ లేబర్ అడ్డా సమస్యకు పరిష్కారం

**చూపిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

**కార్మికులకు ప్రత్యామ్నాయ ప్రాంతంలో కనీస సౌకర్యాల కల్పనకు హామీ**



**హయత్‌నగర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని లేబర్ అడ్డా సమస్యకు పరిష్కారం చూపేందుకు ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చర్యలు చేపట్టారు. ఈ మేరకు శాసనసభ్యులు లేబర్ అడ్డా వద్ద స్థానిక కాలనీవాసులు, కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల కాలనీవాసులు మాట్లాడుతూ.. లేబర్ అడ్డా కారణంగా ప్రతిరోజూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లపైనే మూత్రవిసర్జన చేయడం, పేకాట ఆడటం, రోడ్డు పక్కనే నిద్రించడం వంటి కారణాలతో ముఖ్యంగా మహిళలు, స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లేబర్ అడ్డాను మరో ప్రాంతానికి తరలించాలని ఎమ్మెల్యేను కోరారు. కాలనీవాసుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడే జీవనోపాధి పొందుతున్న కార్మికులకు ఇబ్బంది కలగకుండా, స్థానిక ప్రజల సమస్యలకు కూడా పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేడియో స్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్ ప్రాంతంలో కార్మికుల కోసం మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం, విశ్రాంతి తీసుకునేందుకు షెడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనికి కార్మికులు కూడా అంగీకారం తెలిపారు. అదేవిధంగా స్థానిక ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి లేబర్ అడ్డా వద్ద కార్మికులకు, స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. లేబర్ అడ్డాను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించడంతో పాటు కార్మికులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంపై చుట్టుపక్కల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్, గుత్త లక్ష్మారెడ్డి, దీపావళి శ్రీకాంత్‌లతో పాటు పలువురు కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.



# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం

**హయత్ నగర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ డివిజన్, వెంకటేశ్వర కాలనీలోని ప్రముఖ ప్లాజా అపార్ట్‌మెంట్‌లో సామ దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నరసింహ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అపార్ట్‌మెంట్‌కు చెందిన పలువురు పట్టభద్రులు కార్యక్రమంలో పాల్గొని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. యువత, ఉద్యోగులు, విద్యావంతులు తమ ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీను, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అపార్ట్‌మెంట్ వాసులు, పలువురు పట్టభద్రులు పాల్గొన్నారు.

# ఇంద్రారెడ్డి జయంతి



**మొయినాబాద్ జనంసాక్షి సెప్టెంబర్ 04 :** సజ్జన్ పల్లి గ్రామంలో ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో సజ్జన్ పల్లి గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు చించేటి నరసింహారెడ్డి వార్డ్ మెంబర్స్ కత్తుల కృష్ణ సాయి కుమార్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ యాదవ్ కత్తుల నరేందర్ నవీన్ యాదవ్ శ్రీకాంత్ యాదవ్ మిథున్ కుమార్ మాధవరెడ్డి తిరుపతిరెడ్డి సాయికుమార్ రెడ్డి వెంకటేష్ కత్తుల నర్సింలు కొడుదుటి శ్రీనివాస్ లక్ష్మయ్య ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# బీసీ మహా గర్జనకు పెద్ద గోల్కొండ నుంచి 200 మంది తరలింపు



**శంషాబాద్,అక్టోబర్4(జనంసాక్షి) :** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు పెద్దగోల్కొండ గ్రామం నుంచి నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు బస్సుల్లో సుమారు 200 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గొల్లపల్లిలో నిర్వహించిన బీసీ మహాగర్జనకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయమైన వాటా, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల ఐక్యత, సామాజిక న్యాయం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కే.దేవేందర్, రాజశేఖర్‌రెడ్డి, బిక్షపతి, మహనిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం



**హయత్ నగర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** లయన్స్ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ స్వామి వివేకానంద పార్కులో ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి మరియు బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు లయన్స్ క్లబ్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని ప్రజలు, మహిళలు, వృద్ధులు ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఉచితంగా అందుబాటులోకి వచ్చే వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అశోక్ కుమార్, చైర్మన్ నందకిషోర్, అధ్యక్షులు భాస్కర్, సెక్రటరీ గిరిజాపతి, ట్రెజరర్ అభిరామ్, పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్-2 అధ్యక్షులు మహేందర్ రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, రంగారెడ్డి అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు విజయ్ కుమార్, రవిశంకర్, నారాయణ, శ్రీనివాస్ రావు, వెంకట్ రెడ్డి, చిన్న యాదవ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





# తాండూరులో బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాల

### భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చిన జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్

**తాండూరు అక్టోబర్ 4(జనంసాక్షి) :** బీజేపీ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు యు. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో తాండూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలి. ఓట్ల ఎన్ రోల్మెంట్ ఎలా చేయించాలి, పట్టభద్రుల దగ్గరికి ఎలా వెళ్లాలి, ఎన్నికల్లో అందర్నీ కలుపుకుని పోవడం ఎలా అనే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వికారాబాద్ జిల్లాలో, ముఖ్యంగా తాండూరు పట్టణం మరియు తాండూరు మండలంలో పట్టభద్రుల అత్యధిక ఓట్లు సాధించే విధంగా కృషి చేయాలి అని కార్యకర్తలకు మార్గదర్శకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు కృష్ణ ముదిరాజ్, పటేల్ విజయ్ కుమార్, నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్ ,బంటారం భద్రేశ్వర్, సాయి రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు, తాండూరు ఫ్లోర్ లీడర్ 28వ వార్డ్ కౌన్సిలర్ నాగారం మల్లేశం, 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, జిల్లా మాజీ కౌన్సిలర్ బాలప్ప, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బండారు శ్రీకాంత్, మట్టం మల్లు, పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, చిదిరి ప్రకాష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మంతటి రాజు, తాంద్ర నరేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**తాండూరు అక్టోబర్ 4(జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ అని మున్సిపల్ చైర్పర్సన్ నీరజబాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని వార్డ్ నెంబర్ 10 లో ఉన్న ఎస్టీ హాస్టల్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ నీరజబాల్ రెడ్డి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మన తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. పిల్లలు చదువుతో పాటు మన సంస్కృతిని కూడా తెలుసుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ వేడుకల్లో వార్డ్ కౌన్సిలర్ శ్రీకాంత్, హాస్టల్ వార్డెన్ భాగ్యలక్ష్మి, హాస్టల్ టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

# బాచ్పన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### 30 యూనిట్ల రక్తదానం - సేవా స్ఫూర్తిని చాటిన రక్తదాతలు

**తాండూరు అక్టోబర్ 4(జనంసాక్షి) :** ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం అందించాలనే సేవా సంకల్పంతో బాచ్పన్ చారిటబుల్ ట్రస్ట్ తాండూరు ఆధ్వర్యంలో డా. కళ్యాణ్ మోహన్ రావు జేబి హాస్పిటల్ తాండూరు సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సుమారు 30 యూనిట్ల రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేశారు. ఈ శిబిరంలో సెయింట్ మార్క్స్ హై స్కూల్ తాండూరు 1998--1999 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సహచరులు, రాజకీయ నాయకులు తదితరులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిసిసి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ధరాసింగ్, మాజీ ఎయంసి చైర్మన్ బాల్ రెడ్డి, తాండూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బతుల నాగు, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హబీబ్ లాలా , కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు. డా. కళ్యాణ్ మోహన్ రావు మాట్లాడుతూ, రక్తదానం అత్యవసర సమయంలో ఒక ప్రాణాన్ని కాపాడే గొప్ప సేవ. ప్రతి ఒక్కరూ ఈ మహత్కార్యంలో భాగస్వాములు కావాలి అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి మాట్లాడుతూ, బాచ్పన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం అభినందనీయం. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని అన్నారు. పిసిసి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ధరాసింగ్ మాట్లాడుతూ రక్తదానం మానవత్వానికి ప్రతీక. రక్తదాతలు అందించిన సేవ మరువలేనిది అన్నారు. బాచ్పన్ చారిటబుల్ ట్రస్ట్ పౌండేషన్ మరియు చైర్మన్ మోహన్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ మన రక్తం మరొకరి ప్రాణానికి ఆధారం కావడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలనిఅన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు ఎయం.ఎ. మతీన్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానం. బాచ్పన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ, జేబి హాస్పిటల్ యాజమాన్యానికి, డా. కళ్యాణ్ మోహన్ రావుకి, కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేయోభిలాషులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ బాచ్పన్ చారిటబుల్ ట్రస్ట్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.



# స్వర్ణగిరి కాలనీలో జై భీమ్ అసోసియేషన్ ఏర్పాటు

### కాలనీ అభివృద్ధి, ప్రజా సేవే లక్ష్యంగా ముందడుగు

### సభ్యుల సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయం



**ఘట్కేసర్, పోచరం 8వ డివిజన్, /స్వర్ణగిరి కాలనీ, అక్టోబర్ 04 (జనం సాక్షి):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని స్వర్ణగిరి కాలనీలో జై భీమ్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. కాలనీలోని ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, అందరికీ అండగా నిలుస్తూ కాలనీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలనే లక్ష్యంతో అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధి, సామాజిక కార్యక్రమాల నిర్వహణ కోసం సభ్యుల నుంచి కనీసం రూ.200 చొప్పున విరాళాన్ని సేకరించాలని నిర్ణయించారు. సభ్యులందరి సహకారంతో సంఘాన్ని బలోపేతం చేసి, కాలనీలో ఎదురయ్యే సమస్యలను సమిష్టిగా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, సామాజిక న్యాయం, ఐక్యతను ముందుకు తీసుకెళ్లేలా అసోసియేషన్ కార్యకలాపాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కాలనీలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని, అవసరమైన సమయంలో ఒకరికొకరు సహాయ సహకారాలు అందించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అందరూ ఐక్యంగా ముందుకు సాగితే కాలనీ అభివృద్ధితో పాటు సమాజంలోనూ సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అడ్వైజర్, మంద స్వామిదాస్, అధ్యక్షులు, సుధా కిశోర్, సెకరటరీ, ఎ. భాస్కర్, ట్రెసిరేర్, టి. సారయ్య వైస్ ప్రెసిడెంట్, బీ నరేష్ , పెద్ది రాజు, గిరి, అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి రోజు దళిత మహిళపై దాడి దురదృష్టకరం

### బోడుప్పల్లో 398వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల

### మహిళల జోలికొస్తే కఠిన చర్యలు అమలు చేయాలి

### అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య



**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 398వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామం అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి రోజున గనిపల్లి మాధవి అనే దళిత మహిళ పైన అదే గ్రామానికి చెందిన కొప్పోలు అమర్నాథ్ గౌడ్ అనే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆమెపై దాడి చేశాడు. ఈ సంఘటనను అంబేద్కర్ ఆశయ సాధన సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, మహిళలపై దాడి చేయడం దురదృష్టకరమని తక్షణమే దాడి చేసిన వ్యక్తి పై ఎస్సీ అట్రాసిటీ కేసుతోపాటు పిడి యాక్ట్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తూ, తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించిన మహిళలపై దాడి చేయడం హేయమైన చర్య అని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గరుగుల యాకయ్య, సాయి బండారి, శ్రీధర్ గుప్తా, రాపోలు వెంకటేష్, చిల్ల అంజయ్య, గుంజి శ్రీనివాస్ డింపు తదితరులు పాల్గొన్నారు.



# బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించాలి

### టీపీసీసీ ఉపాధ్యక్షుడు సానెం శ్రీనివాస్‌గౌడ్

**శంషాబాద్,అక్టోబర్4(జనంసాక్షి) :** బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు కల్పించాలని, బీసీల ఐక్యతతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సానెం శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం శంషాబాద్ గొల్లపల్లిలో నిర్వహించిన బీసీ మహాగర్జన సభ విజయవంతమైన అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.బీసీలకు జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాతినిధ్యం, హక్కులు కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీల సమస్యలపై ఐక్యంగా పోరాడితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ మహా గర్జన సభలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జల్పల్లి నరేందర్, ఓబిలి శేఖర్, దూడల వెంకటేష్ గౌడ్, కరుణాకర్ గౌడ్, లింగం యాదవ్ సంజయ్ యాదవ్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రిషిత రెడ్డి జ్ఞాపకార్థంగా అన్నదానం



**మొయినాబాద్ జనంసాక్షి:** ఇటీవలే మరణించిన సామా రిషితా రెడ్డి జ్ఞాపకార్థంగా ఫుడ్ డొనేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామ రిషిత రెడ్డి 8వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు అందరూ కలిసి రిషిత రెడ్డి జ్ఞాపకార్థంగా ఆమెను గుర్తు చేసుకుని వారందరూ కలిసి పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సామ రిషిత రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని నిర్వహించామని తోటి విద్యార్థులు తెలిపారు.

# సేవా కార్యక్రమాలతో సురేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



**హయత్ నగర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ చేయూత ఫౌండేషన్ -- హైదరాబాద్ ఓల్డ్ ఏజ్ హోమ్ సెంటర్ లో వృద్ధులు, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధుల ఆశీస్సులు తీసుకుని, చిన్నారులతో కొంత సమయం ఆనందంగా గడిపారు. తన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని సురేష్ యాదవ్ తెలిపారు. వృద్ధుల ఆశీస్సులు పొందడం, చిన్నారులతో సమయం గడపడం తనకు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగించిందన్నారు. భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు.



# ఎమ్మార్వో కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహణ

### మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

### ఆరోగ్య పరీక్షలు, నిపుణుల వైద్య సేవలు




**బోడుప్పల్-జనంసాక్షి :** మేడిపల్లి మండల ఎమ్మార్వో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీరాములు గౌడ్ హాజరయ్యారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో వందలాది మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ అనిల్ కుమార్,డాక్టర్ బాలకృష్ణ,డాక్టర్ ఇమ్రాన్ కాజ్మీ,డాక్టర్ స్పందన,డాక్టర్ అనూష పటేల్,డాక్టర్ సుష్మ,డాక్టర్ మధు తదితర వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు.సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు,మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరం నిర్వహణలో ఆసుపత్రి సిబ్బంది అనూష,భరత్,సురేష్,సంగీత,స్వప్న,నవ్య,వాసు,శ్రీహరి, సుష్మితలు కీలక పాత్ర పోషించారు.ఈ సందర్భంగా ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించాలని కోరగా నిర్వాహకులు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.





# డ్రైనేజీ సమస్యకు చెక్

**ముప్పా రామారావు**

## బండ్లగూడ వీకర్ సెక్షన్ కాలనీలో యూజీడీ పనులకు శ్రీకారం

**కీసర, అక్టోబర్ 04 (జనంసాక్షి) :** కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముప్పా రామారావు అన్నారు. దమ్మాయిగూడ డివిజన్ పరిది లోని బండ్లగూడ వీకర్ సెక్షన్ కాలనీలో 30 మీటర్ల పొడవు, ఒక అడుగు వెడల్పుతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పా రామారావు మాట్లాడుతూ.. కాలనీల్లో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన మౌలిక వసతుల పనులను చేపడుతున్నట్లు తెలిపారు. యూజీడీ పనులు పూర్తయితే మురుగునీటి సమస్య కొంతమేర పరిష్కారమై, స్థానికులకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సురకంటి శ్రీకాంత్‌రెడ్డి, గండి యాదగిరిగౌడ్, వరగంటి వెంకటేష్, సామల శ్రీనివాస్‌రెడ్డి, ఈగ శ్వేతారాజ్, గోవింద్‌సింగ్, దిలీప్, కిట్టు, సామ్మిరెడ్డి, బాలమణి, రాములు, చంద్రయ్య, ముంతాజ్, ఓజల్, కాలనీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## చర్లపల్లి జైలు సూపరిడెంట్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



**కీసర, అక్టోబర్ 04 (జనంసాక్షి) :** చర్లపల్లి కేంద్ర కారాగార సూపరింటెండెంట్‌ను నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంగ శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీహరి, చిన్నంరాజు సతీష్ గౌడ్, దాసోహం నర్సింగరావు జైలు సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

## మోమిన్‌పేటలో శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్ ప్రారంభం



**మోమిన్‌పేట (జనం సాక్షి) :** మోమిన్‌పేట మండల కేంద్రంలో న్యూ బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆసుపత్రిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుసుభాష్ గౌడ్, రావులపల్లి సర్పంచ్ యాదవ రెడ్డి, డాక్టర్ జిమ్మే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పటల్ మేనేజ్మెంట్ మహమ్మద్ హర్షద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటల ఎమర్జెన్సీ సేవలు, జనరల్ మెడిసిన్, డయాగ్నొస్టిక్ సేవలు, ఫార్మసీ, డయాగ్నొస్టిక్ ల్యాబ్ వంటి పలు వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. డాక్టర్స్ అందుబాటులో ఉంటారన్నారు మోమిన్‌పేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఆస్పత్రి మేనేజ్మెంట్ మహమ్మద్ హర్షద్ ను అభినందించారు కార్యక్రమంలో డాక్టర్స్ గంగాధర్ రఫీ యుద్దీన్ శ్రావణ్ నాయకులు మల్లయ్య ఏ రాజ్ పాషా పడియాల బాబు బాబుమియా ప్రవీణ్ నర్సింలు మానేయ్య స్థానికులు తదితరులు పాల్గొన్నారు

# ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




**శంకర్‌పల్లి, అక్టోబర్ 4 (జనం సాక్షి):** మాజీ హోంమంత్రి, దివంగత నేత ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా "ఇంద్రారెడ్డి అమర్ రహే" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఇంద్రారెడ్డి ప్రజల కోసం నిరంతరం పనిచేసిన మహానేత అని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారుప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం పోరాడిన ఇంద్రారెడ్డి సేవా స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ ఉషారాణి విజయ్ కుమార్, నాయకులు దోసాడ నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉపేందర్ రెడ్డి, శ్రీనాథ్ గౌడ్, నారాయణ, కొంగల మల్లేష్, వెంకట్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కొండ మానేయ, గోవర్ధన్, పాండు, రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఓబీసీ గర్జనకు తరలిన కాంగ్రెస్ నాయకులు



**రాజేంద్రనగర్, అక్టోబర్4(జనంసాక్షి) :** శంషాబాద్‌లో నిర్వహించిన ఓబీసీ గర్జన కార్యక్రమానికి మణికొండ, నెక్నాంపూర్ 127, 128 డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీసీ హక్కులు, సామాజిక న్యాయం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెక్నాంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ మెరుగు, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, ఏ బ్లాక్ అధ్యక్షురాలు ఇందిర, నెక్నాంపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రావణ్, మణికొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, రాజు, రవికాంత్, రమేష్, షేక్ హాజీ, ప్రవీణ్ కుమార్, శివరెడ్డి, రాములు, విఠల్ రెడ్డి, ప్రదీప్, మాధవి, రాము, శ్రీకాంత్, శ్రీనివాస్, రమాదేవి, నరేందర్, ధనరాజ్, ఇమ్రాన్, మారుతి, కార్తీక్ రెడ్డి, కమలాకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌పైరీ కూల్‌డ్రింక్స్ విక్రయాలు.. శంకర్‌పల్లిలో కలకలం

**శంకర్‌పల్లి, అక్టోబర్ 4 (జనంసాక్షి):** శంకర్‌పల్లి పట్టణంలోని సంగారెడ్డి రోడ్డులో ఉన్న శ్రీ సాయి బేకరీలో ఎక్స్‌పైరీ తేదీ దాటిన కూల్‌డ్రింక్ విక్రయిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఆదివారం బేకరీలో విక్రయానికి ఉంచిన మామిడి ఫ్రూట్ డ్రింక్ బాటిల్‌పై ముద్రించిన తేదీని పరిశీలించగా, కాలం చెల్లిన ఉత్పత్తి విక్రయానికి ఉంచినట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార, పానీయాల విషయంలో వ్యాపారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అయితే ఎక్స్‌పైరీ తేదీ స్పష్టంగా కనిపించే కూల్‌డ్రింక్‌నే విక్రయానికి ఉంచడం చర్చనీయాంశంగా మారింది. కంటికి కనిపించే



ఉత్పత్తులపైనే ఇలాంటి పరిస్థితి ఉంటే, తయారీ తేదీ, గడువు తేదీ స్పష్టంగా కనిపించని ఇతర తినుబండారాలు, బేకరీ ఉత్పత్తుల నాణ్యతను ఎంతవరకు పరిశీలిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బేకరీలో నిల్వ ఉంచిన ఇతర ఆహార పదార్థాల గడువు తేదీలు, నిల్వ విధానాలను సంబంధిత అధికారులు తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆహార భద్రతా అధికారులు శ్రీ సాయి బేకరీపై తనిఖీలు నిర్వహించి, విక్రయిస్తున్న ఉత్పత్తుల తేదీలు, నాణ్యత, నిల్వ పరిస్థితులను పరిశీలించాలని వినియోగదారులు కోరుతున్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాల విక్రయాలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బీసీ సింహ గర్జనకు నార్సింగ్ సర్కిల్ నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ నాయకులు



**రాజేంద్రనగర్ (జనంసాక్షి) :** శంషాబాద్ గొల్లపల్లిలో నిర్వహించిన బీసీ సింహ గర్జన కార్యక్రమానికి నార్సింగ్ సర్కిల్, మణికొండ డివిజన్ల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నార్సింగి, మణికొండ డివిజన్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, బుద్దోలు శ్రీరాములు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బీసీల ఐక్యతను చాటుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీసీల ఐక్యత వర్ధిల్లాలి జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్ అంటూ నినాదాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం అవసరమని నాయకులు పేర్కొన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వారు తెలిపారు. బీసీల హక్కులు, అవకాశాల కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్–నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు తలారి మల్లేష్ ముదిరాజ్, కోట వేణుగౌడ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దుడ్డు కిరణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, ఉషారాణి, మాజీ ఎంపీటీసీ ముదిరాజ్, నాయకులు జి.శ్రవణ్‌కుమార్, జెల్లీ వెంకటేష్ ముదిరాజ్, కైరంకొండ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కారు బీభత్సం

**పోచరం, అక్టోబర్ 04 (జనంసాక్షి) :** పోచరం వెళ్ళే దారిలో బీటెక్ యువకుల హల్చల్ మద్యం మత్తులో కరెంటు పోల్ కు కార్ ఢీ. 4వ తేదీ తెల్లవారు జామున సుమారు 3 : 30 గంటలకు రెండు కరెంటు పోల్లను మద్యం మత్తులో అతి వేగంతో అదుపు తప్పి ఢీ కొనగా కరెంటు మెయిన్ లైన్ పోల్ ఒక దానికి మరొకటి తగలగా తృటిలో ప్రమాదం తప్పింది. పోచరం 8వ డివిజన్ పోచరం, స్వర్ణగిరికాలని, డాక్టర్స్ కాలనీ, యాదాద్రి కాలనీలకు సుమారు 5 గంటలు విద్యుత్ అంతరాయం కలిగింది. కారులో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఎటువంటి గాయాలు లేకుండా బయట పడ్డారు. ప్రమాదానికి గురైన కారు బోవనగిరి ప్రాంతానికి చెందిందిగా గుర్తించారు. ఈ ఘటన పై పోచరం ఐటీ కారిడార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# యాలాల మండలంలో కాంగ్రెస్-బీఆర్ఎస్ మాటల హోరు

**అధికార-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం**

**మౌన ప్రేక్షకుడిగా బీజేపీ తీరు**

**యాలాల (జనంసాక్షి ) :** యాలాల మండల రాజకీయాల్లో ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం హోరెత్తుతోంది. ఒక పార్టీపై మరో పార్టీ విమర్శలు, ప్రతివిమర్శలతో రాజకీయ వేడి కనిపిస్తున్నప్పటికీ.. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రం మండల రాజకీయ తెరపై పెద్దగా కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపాల్సిన బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీజేపీ స్థానిక నాయకత్వం ఏ మేరకు తన పాత్ర పోషిస్తోందన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

యాలాల మండలంలో ఏ రాజకీయ అంశం తెరపైకి వచ్చినా ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్యే ప్రధానంగా మాటల తూటాలు పేలుతున్నాయి. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, నీటి సమస్యలు, స్థానిక రాజకీయ అంశాలపై ఇరు పార్టీల నాయకులు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. దీంతో మండల రాజకీయాల్లో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్యే ప్రత్యక్ష పోటీ కొనసాగుతున్న భావన ప్రజల్లో ఏర్పడుతోంది. అయితే ఇదే సమయంలో బీజేపీ స్థానిక నాయకత్వం ఎక్కడుందన్న ప్రశ్న ఎదురవుతోంది. అధికార పార్టీపై నిర్మాణాత్మక విమర్శలు చేయడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాల్లో బీజేపీ పాత్ర అంతంత మాత్రంగానే ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి దేశవ్యాప్తంగా బలమైన రాజకీయ స్థానం ఉన్నప్పటికి యాలాల మండల స్థాయిలో మాత్రం ఆ పార్టీ ప్రభావం మచ్చుకైనా కనిపించడం లేదనే చర్చ సాగుతోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యలపై పార్టీ




తరఫున గళమెత్తే నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.కేవలం పార్టీ పేరు, కేంద్రంలోని అధికారాన్ని ప్రస్తావించుకోవడం ద్వారా స్థానికంగా రాజకీయ బలం పెరగదని.. ప్రజల మధ్య నిరంతరం ఉండి వారి సమస్యలపై పోరాడితేనే పార్టీకి పునాది బలపడుతుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందన్న విషయాన్ని ప్రస్తావించుకోవడం తప్ప యాలాల మండలంలో స్థానిక ప్రజలకు పార్టీ చేసిన ప్రత్యక్ష కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేపట్టిన ఉద్యమాలు, ప్రభుత్వాన్ని నిలదీసిన సందర్భాలు పెద్దగా కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'చెట్టు పేరు చెప్పి కాయలు అమ్మడం' తరహాలో కేంద్రంలోని పార్టీ బలాన్ని స్థానిక రాజకీయాలకు అన్వయించుకోవడం కంటే మండల ప్రజల మధ్య పార్టీకి సొంత బలం నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. యాలాలలో బీజేపీకి కార్యకర్తలు, అభిమానులు ఉన్నప్పటికి వారిని సమన్వయం చేస్తూ పార్టీని ముందుకు నడిపించే బలమైన మండల స్థాయి నాయకత్వం లోపించిందా? అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. నిత్యం ప్రజల మధ్య ఉండటం, గ్రామాల్లో పర్యటించడం, సమస్యలను గుర్తించడం, అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించడం, వంటి కార్యక్రమాలే పార్టీకి స్థిరమైన పునాదిని ఏర్పరుస్తాయి. ఈ విషయంలో బీజేపీ మండల నాయకత్వం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు రోజురోజుకూ బహిరంగమవు తున్న వేళ.. బీజేపీ మాత్రం ప్రేక్షక పాత్రకే పరిమితమైతే మండలంలో ఆ పార్టీ మనుగడ, భవిష్యత్ రాజకీయ విస్తరణ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తేనే బీజేపీకి యాలాల మండలంలో రాజకీయ స్థానం ఏర్పడే అవకాశం ఉంటుంది. లేకపోతే ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీ జెండాలు, నినాదాలు కనిపించి.. ఆ తర్వాత మళ్లీ రాజకీయంగా మౌనం నెలకొనే పరిస్థితి కొనసాగుతుందనే విమర్శలు మరింత బలపడే అవకాశం ఉంది.



## ఓబీసీ సింహగర్జన సభకు బయలుదేరిన చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు

**చేవెళ్ల, అక్టోబర్ 04 (జనంసాక్షి)** శంషాబాద్‌లో నిర్వహించిన ఓబీసీ సింహగర్జన సభకు చేవెళ్ల మున్సిపల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మల్గారి జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, తాళ్లపల్లి నర్సింహులు, కృష్ణా నాయక్, మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, సీనియర్ నాయకులు వసంతం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్గారి కార్తిక్‌రెడ్డి, జాంగీర్, కో-ఆప్షన్ సభ్యులు రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు గంగి యాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్, కర్నె శివప్రసాద్, గుండాల రాములు తదితరులు శంషాబాద్‌లో జరిగే సభకు బయలుదేరారు. ఓబీసీల హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల అంశాలపై నిర్వహిస్తున్న సభలో పాల్గొనేందుకు చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

# సై అంటున్న సాయి.. గొల్లుమంటున్న గోపాల్

**సోషల్ మీడియా ద్వారా ఒ3కరిపై ఒకరు రెచ్చిపోతున్న రాజకీయ నాయకులు. ఒకపక్క బీఆర్ఎస్ మరోపక్క బిజెపి నాయకుడు నువ్వా నేనా అనే రీతిలో సోషల్ మీడియా ద్వారానే కొట్టుకుంటున్నట్టుగా వారి మాటల యుద్ధం కనబడుతుంది. మరోపక్క ఇతర పార్టీల నాయకులు స్థానిక నాయకులు సొంత పార్టీల నాయకులు సైతం వీరిద్దరి వ్యవహార శైలిపై ఎవరికి ఏమీ అర్థం కాని పరిస్థితిలో తలలు పట్టుకుంటున్నారు.**

**టిఆర్ఎస్ వర్సెస్ బిజెపి**

**సోషల్ మీడియా ద్వారా ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్న రాజకీయ నాయకులు**

**జనంసాక్షి /నాచారం :** ఎన్నికలు మాట దేవుడెరుగు,కానీ రాజకీయ నాయకుల హాట్,హాట్,అసభ్యకర మాటలతో మాత్రం సోషల్ మీడియాలో ఒకరి పై ఒకరు మాటల యుద్ధం తో వినూత్న రీతి లో తిట్టుకుంటున్న తీరు నాచారం డివిజన్ లో కనపడుతున్నది.నాచారం డివిజన్ అభివృద్ధి విషయం లో నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భర్త సాయి జెన్ శేఖర్ వ్యవహార తీరు విషయం లో నాచారం వాసి,బీజేపీ అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్,సోషల్ మీడియా లో మాటల యుద్ధం రచ్చ రచ్చ గా మారిపోతుంది. ఆదివారం రోజున భవాని నగర్ లో జరిగిన కాలనీ సమావేశం లో అభివృద్ధి కొరకు చర్చలు జరిపారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథి గా ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మరియు స్థానిక టిఆర్ఎస్ నాయకులు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అభివృద్ధిని గురించి గతంలో చేసిన పనులను గురించి ప్రస్తుతం ఉన్న పరిస్థితులను గురించి ఉప్పల్ ఎమ్మెల్యే మరియు నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భర్త సాయి జెన్ శేఖర్ స్థానిక నాయకులు ప్రసంగించారు. అనంతరం ఈ ప్రసంగంలో భాగంగా మాజీ కార్పొరేటర్ భర్త సాయి జెన్ శేఖర్ గత పాలకులను ఉద్దేశించి మాట్లాడుతూ కనీసం విలువలు లేకుండా ఇష్టానుసారంగా గర్వంతో మానవత్వ విలువలను పాటించకుండా ప్రసంగించడం చాలా అవమానకరమని బిజెపి నాయకుడు పోతగాని గోపాల్ గౌడ్ సోషల్ మీడియా ద్వారా హెచ్చరించాడు.ఇద్దరు సైతం గతం లో ఒకరి పై ఒకరు దుర్భషలు ఆదుకున్నారు.మరోసారి ఏకంగా నాచారం కూరగాయల మార్కెట్ లో నాచారం డివిజన్ బిజెపి నాయకుడు పోతగాని గోపాల్ గౌడ్,నాచారం డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు సాయి జెన్ శేఖర్ మధ్య జరిగిన పోరు లో ఏకంగా రక్తపాతం జరిగిన విషయం నియోజక వర్గం మొత్తం తెలిసినదే.ఈ విషయం లో నాచారం పోలీసుస్టేషన్ లో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నారు. మరోసారి అనగా ఆదివారం నాచారం డివిజన్లోని భవాని నగర్ లో జరిగిన కాలనీవాసుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ భర్త సాయిజెన్ శేఖర్, అభివృద్ధి పనులను గత పది సంవత్సరాలలో తాము చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు చెప్పుకుంటూ గతంలో జరిగిన ఇతర పార్టీ ప్రజాప్రతినిధుల గురించి వారి నిర్లక్ష్యం గురించి ప్రసంగించడం జరిగింది. ఈ విధంగా ప్రసంగించడం చాలా అవమానకరమని పోతగాని గోపాల్ గౌడ్ బిజెపి అధికారం ప్రతినిధి మండిపడ్డాడు. గత పాలకుల విషయంలో మర్యాద లేకుండా ప్రసంగించడం అంతేకాకుండా ఎవరు అడ్డొస్తే వారిని కచ్చితంగా వీపు విమానమూత మోగిస్తానని ఇష్టానుసారంగా మాట్లాడడం చాలా అవమానకరమని ఈ రకంగా మాట్లాడడం రాజకీయ నాయకుడి లక్షణం కాదని బిజెపి నాయకుడు పోతగాని గోపాల్ గౌడ్ తన సోషల్ మీడియా ద్వారా సాయి జెన్ శేఖర్ ను హెచ్చరించడం జరిగింది. ఇరువురు గతం నుండి సోషల్ మీడియా ద్వారా తమ పార్టీ మనుగడను కాపాడుకొనుటక లేక ప్రజల్లో తమ యొక్క సత్తా చూపుటక తెలియదు కానీ సోషల్ మీడియా




ఆక్టివిటీస్ లో మాత్రం చురుగ్గా ఉంటున్నారు మరియు తమ ప్రసంగాలతో నాచారం డివిజన్ హెచ్ఎంటి డివిజన్ ప్రజల నోళ్లల్లో మాత్రం నిరంతరం నిలిచిపోతున్నారు. ఈ విషయంలో అసలు ప్రజలు తమని ఏమనుకుంటున్నారు అనేటువంటి అంశాలను మాత్రం ఇరు నాయకులు మాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని కొంతమంది రాజకీయ నిపుణులు ఇతర పార్టీ నాయకులు గుసగుసలాడుతున్నారు.

**ప్రజల్లో మంచి వాడిగా ఎవరు నిలుస్తారో..?**

నాచారం హెచ్ఎంటి నగర్ డివిజన్లో బిజెపి బీఆర్ఎస్ నాయకుల విషయంలో ఒకపక్క ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉన్నట్టుంటే. మరోపక్క అన్ని పార్టీల నాయకులు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా ఎప్పుడు మేము ఎన్నికల్లో నిలబడాలి ఎప్పుడు కార్పొరేటర్ గా మరో అవతారం ఎత్తాలని ఎదురుచూస్తున్న నాయకులు ఎందరో. ఇదిలా ఉండగా మాజీ కార్పొరేటర్ భర్త సాయి జెన్ శేఖర్, మరియు స్థానికుడు బిజెపి పార్టీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ మధ్య జరుగుతున్న మాటల యుద్ధం పార్టీల నుండి మొదలుకొని పార్టీ వ్యవహార శైలి నుంచి అంచులు దాటి వ్యక్తిగత దూషణ వరకు కూడా వెళ్లిపోయింది. రాజకీయంలో ఒడిదుడుకులు సహజం ఓర్పు సహనం అనేటివి లేకుంటే ప్రజల్లో కచ్చితంగా హీరోలు కాదు సరే కనీస గుర్తింపు కూడా లేకుండా పోతుందనే విషయం మరిచిపోతున్నారా లేక ఈ విధంగా ఉంటేనే తమకు సరైన గుర్తింపు లభిస్తుందని ఆలోచనతో కొత్త ఒరవడిని నేర్పుతున్నారా అనేటువంటిది ప్రజలే గమనించాలి. రాజకీయం అంటేనే హుందాతనం ఏ ఒక్కరికి సొంతం కాకుండా సమన్యాయం చేసే దిశగా ఉండాల్సిన లక్షణాలు ఒక రాజకీయ నాయకుడికి ఉండాలి, నిరంతరం ప్రజల కోసం సేవకుడిగా పనిచేసే వారికే ప్రజలు పట్టం కడతారు, అలాంటి లక్షణాలతో పాటు ఓర్పు సహనం ఇతర ఇతరుల నుండి విమర్శలతో పాటు ఎన్నో ఆటంకాలు ఎదురైనా వాటన్నింటినీ పట్టించుకోకుండా భవిష్యత్ ప్రణాళిక గురించి ఆలోచించే వాడే నిజమైన నాయకుడు అంతేకానీ ఒకరిపై ఒకరు ఇష్టానుసారంగా వ్యక్తిగతంగా దూషించుకుంటూ పార్టీలను అడ్డుపెట్టుకొని ఈ రకంగా మాట్లాడుకుంటూ పోతే నిజంగా ప్రజలు నమ్ముతారా లేక వీరు తమ వ్యక్తిగతంగా పగలను తీర్చుకునే రకంగా వారికి వారే సొంతమని గ్రహించి వదిలేస్తారా అనే అంశాలను ప్రతి నాయకుడు కూడా గమనించుకోవాల్సింది.

నాచారం హెచ్ఎంటి నగర్ డివిజన్లోని నాయకుల తీరు ఎన్నడు మారుతుందో ఇక వేచి చూడాల్సిందే ఎందుకంటే వ్యక్తిగత దూషణలు కాదు కదా పార్టీల మనుగడ కోసం ప్రజల కోసం పార్టీ తీసుకున్న నిర్ణయాలను పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే రకంగా పనిచేస్తారా లేకుంటే ఈ రకంగా సోషల్ మీడియా ద్వారా ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటూ తమ సత్తాను చాటుకునే విధంగా తమకు తామే హీరోలమనేటువంటి రకంగా తమ వ్యవహార శైలిని నడుపుకుంటూ కాలం గడుపుతారా, ఎవరు మంచి ఎవరు చెడు అనేటువంటి నిర్ణయాన్ని ఇక ప్రజలే వీరి పట్ల నిర్ణయం తీసుకోవాల్సిందే.



## 14వ వార్డులో చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి పర్యటన

### ప్రజా సమస్యలపై ఆరా..నీటి పొదుపుపై అవగాహన

**చేవెళ్ల, అక్టోబర్ 04 (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో చైర్‌పర్సన్ స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులోని నీటి నల్లాలను పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదని, దీంతో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలకు సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సమస్యల పరిష్కారానికి మున్సిపల్ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరె డ్డి, వార్డు సభ్యులు శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతతో ఓటు నమోదు చేసుకోవాలి

### కాంగ్రెస్ పార్టీ నాయకులు బందీ అనిల్ ముదిరాజ్



**మొయినాబాద్ జనం సాక్షి అక్టోబర్ 04** ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బాధ్యతతో ఓటు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బందీ అనిల్ ముదిరాజ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గతంలో ఓటు హక్కు ఉన్నవారు సైతం గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. అర్హులైనా పట్టుభద్రులందరూ నిర్ణీత గడువులోగా నమోదు చేసుకోవాలని కోరారు.

## తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా హస్నాబాద్ రమేష్



**కొడంగల్ అక్టోబర్ 04( జనం సాక్షి):**తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గా కొడంగల్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన ఎరుకల రమేష్ ఎన్నికయ్యారు. హైద్రాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు కూరాకుల కృష్ణ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలంగాణ లో ఎరుకల కులలకు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఒక ఎరుకల కులానికి చెందిన వ్యక్తి ని గెలిపించడమే లక్ష్యం అని అన్నారు. ఆ దిశగా నేటి నుండి పని చేస్తామని అన్నారు. అలాగే ఎరుకల కులాలకు ప్రజలకు విద్యా అభివృద్ధి లక్ష్యం గా పని చేస్తానని అన్నారు.

# టీయూడబ్ల్యూజే -143 మండల కమిటీ ఎన్నిక



**చౌడపూర్ అక్టోబర్04 (జనం సాక్షి)**

మండలంలో టియు డబ్ల్యూజె హెచ్ -143 యూనియన్ మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగాయి.వికారాబాద్ జిల్లా కమిటీ సూచనల మేరకు పరిగి డివిజన్ అధ్యక్షులు వి శ్రీనివాసరావు, సీనియర్ యూనియన్ నాయకులు కే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పందాల సురేష్, డివిజన్ కార్యదర్శి కోస్గి కుమార్ ల సమక్షంలో ఈ మండల కమిటీ ఎన్నిక జరిగింది మండల కమిటీ అధ్యక్షులుగా కామారం రామస్వామి, ప్రధాన కార్యదర్శి కె. యశ్వంత్, ఉపాధ్యక్షులు జోగు శ్రీనయ్య, కార్యదర్శి పరిగి అశోక్,కొత్తయాదయ్య,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డాక్టర్ బి వెంకటేష్ కోశాధికారి సంటి చందు ఎన్నికయ్యారు.ఇక కార్యవర్గ సభ్యులుగా నసీర్,బుచ్చయ్య,కోస్గి కుమార్,యం.కొండయ్య,శేఖర్,బ్యాగరి శ్రీను,కావాలి నవీన్,మొగిలి గిద్ద గిరి,హన్మంత్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కామారం రామస్వామి మాట్లాడుతూ.. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని,జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తదితరులు పాల్గొన్నారు.

## పొన్నాల్లో మానుక పరమేష్ యాదవ్ ఆధ్వర్యంలో యుత్‌కు క్రికెట్ టోర్నమెంట్



**శామీర్ పేట్, అక్టోబర్ 4(జనంసాక్షి ) :** మూఢుచింతల పల్లి మున్సిపాలిటీలోని పొన్నాల్లో మానుక పరమేష్ యాదవ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈ టోర్నమెంట్ లో 6 జట్లు తలపడగా ఫైనల్ కి బూర్జు టీం 8ఓవర్లల్లో 46/9 చెయ్యగా చింతల్ టీం 7.3 ఓవర్లల్లో 47 రన్నులు సాధించి 6వికెట్ల తేడాతో చింతల్ టీం విజయం సాధించింది. విజయం సాధించిన క్రీడా కారులకు బహుమతులు స్పాన్సర్ మన స్నేహం టీం సభ్యులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మధు, నర్సింహ, కుమార్, దేవేందర్, శ్రీకాంత్,శంకర్, గ్రామ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి

**మల్కాజిగిరి అక్టోబర్ 4 (జనం సాక్షి)**



నేరేడ్‌మెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం డివిజన్ పరిధిలోని మహాబోధి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెతో పాటు భాజపా, తెరాసలకు చెందిన సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మైనంపల్లి హనుమంతరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా నేరేడ్‌మెట్ రజక సంఘం, ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు వివేకానందపురం, ఆర్‌కేపురం, సీబీఎన్ కాలనీలకు చెందిన యువత, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్క కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా మైనంపల్లి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పరిశీలకుడు సమీర్ కౌశల్, మాజీ కార్పొరేటర్లు వై.ప్రేమ్‌కుమార్, రాజ్ జితేంద్రనాథ్, సీనియర్ నేత ఎస్.ఆర్.ప్రసాద్, ఇన్‌ఛార్జి లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేశ యాదవ్, రాఘవన్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జి.ఎన్.వి. సతీశ్‌కుమార్, పిట్టల శ్రీనివాస్, ఎ.కె.మురుగేశ్, జీడి సంపత్ గౌడ్, యూసుఫ్ భాయ్, శ్యామ్, శ్రీనివాస్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు కృష్ణ, మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి పథకానికి 12 ఏళ్లు

### కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కాప్రా, అక్టోబర్ (జనం సాక్షి ) : కళ్యాణ లక్ష్మి’ పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో మహిళా సోదరీమణులు ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకువచ్చిన కేసీఆర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఒక మేనమామలా లక్షలాది పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచిన కేసీఆర్ సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డల తల్లిదండ్రులకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందడంతో పేద కుటుంబాలకు ఎంతో ఊరట లభించిందని మహిళలు పేర్కొన్నారు. ఆడబిడ్డల సంక్షేమం, మహిళల గౌరవం, పేద కుటుంబాల ఆర్థిక భద్రత కోసం తీసుకున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గుర్తుండిపోయేలా ఉన్నాయని తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచిన కేసీఆర్ గారి సేవలను గుర్తు చేసుకుంటూ మహిళా సోదరీమణులు నిర్వహించిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. ఆడబిడ్డల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సోదరీమణులు, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, కుమారస్వామి శివ గౌడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.